నేడు పాలకొల్లులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 17వ తేదీ శుక్రవారం పాలకొల్లు, అడవిపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి పాలకొల్లు టౌన్ 1 ఫీడర్, 11 కెవి వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ఆర్‌డిఎస్ఎస్ స్కీంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. క్రొత్త లైన్స్ వర్క్స్, చెట్ల ఆకులు, చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం శంభునిపేట, బంగారు వారి చెరువు గట్టు, బ్రాడీపేట, పెద్ద పోస్ట్ ఆఫీస్, వెంకటేశ్వర కాలనీ, బ్యాంకు స్ట్రీట్, మెయిన్ రోడ్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ అంతరాయం ఏర్పడును. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ కోరారు.

ఆధునికీకరణకు పాతర..!

డెల్టాలో కాలువల పరిస్థితి దారుణం
పూడుకుపోవడంతో దిగువకు పారని నీరు
ఈ ఏడాదీ చిల్లిగవ్వ పనులు చేపట్టని వైనం
ఆధునికీకరణ పనులకు తిలోదకాలిచ్చిన వైసిపి సర్కార్
ప్రతియేటా సాగునీటి కోసం రైతుల అగచాట్లు

గుర్రపు డెక్కతో నిండిపోయిన ఉండి ప్రధాన కాల్వ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పాతరేసింది. దీంతో గడిచిన ఐదేళ్లుగా జిల్లా రైతాంగం పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఈ ఏడాది వేసవిలో సైతం చిల్లిగవ్వ పని చేయకుండా చేతులెత్తేసిన పరిస్థితి. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 మండలాలు ఉండగా 29 మండలాల్లో డెల్టా ప్రాంతం విస్తరించి ఉంది. గోదావరి నుంచి 11 ప్రధాన కాలువలు, 300కు పైగా పిల్ల కాలువల ద్వారా పంటలకు సాగునీటి సరఫరా జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో డెల్టా పరిధిలో మొత్తం 5.29 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనిలో 4.60 లక్షల ఎకరాలు వరి విస్తీర్ణం ఉండగా, మిగిలిన భూముల్లో చేపల చెరువులు, ఉద్యాన పంటలు ఉన్నాయి. గోదావరి డెల్టా పరిధిలో ఖరీఫ్, రబీలో సైతం వరినాట్లు తప్ప రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేకుండాపోయింది. 2007లో జిల్లాలో డెల్టా ఆధునికీకరణకు రూ.1,464 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. దశాబ్దన్నర కాలం గడిచినా ఇప్పటికీ డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తికాని దుస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ రూ.800 కోట్లు మేర పనులు జరిగాయి. ఇంకా దాదాపు రూ.600 కోట్లు విలువ చేసే పనులు జరగాల్సి ఉంది. చేసిన పనుల్లో సైతం నాణ్యత కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడికక్కడ కాలువలు మెరకదేరిపోయాయి. షట్టర్లు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాలువలు మెరకదేరడంతో సాగునీరు దిగువకు పారడం లేదు. దీంతో ఉండి, నరసాపురం వంటి ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతియేటా కొన్ని పనులైనా జరిగేవి. వైసిపి ప్రభుత్వం వచ్చాక డెల్టా ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. కాలువల నుంచి తట్ట మట్టి తీసిన దాఖలాల్లేవు. నవంబర్‌లో జరిగే జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో డెల్టా ఆధునికీకరణ గురించి మంత్రులు, అధికారులు ఉపన్యాసాలు ఇవ్వడంతోనే సరిపోయింది. డిసెంబర్ నెలాఖరుకు ప్రతిపాదనలు తయారు చేసి జనవరి నెలాఖరుకు టెండర్లు పూర్తి చేయాలని, కాలువలు మూసిన వెంటనే పనులు ప్రారంభించాలని సమావేశాల్లో ఊదరగొట్టేవారు. ఇరిగేషన్ అధికారులు ప్రతియేటా రూ.300 కోట్ల విలువ చేసే పనులకు ప్రతిపాదనలు పంపినా ఒక్కసారి కూడా ప్రభుత్వం ఆమోదించిన పరిస్థితి లేదు. ఈ ఏడాది సైతం ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా ఆమోదం లభించలేదు. దీంతో ఆధునికీకరణ పనులు ఎక్కడా జరగకుండా పోయాయి. ఈ ఏడాది వర్షాలు లేకుండా ఆధునికీకరణ పనులకు అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ పనులు మాత్రం జరగని పరిస్థితి ఉంది.

ప్రతియేటా వేలాది ఎకరాల్లో దెబ్బతింటున్న పంటలు

ఆధునికీకరణ లేక కాలువలు మెరకదేరిపోవడంతో ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. చివ్వరి వర్షాలకు సైతం పొలాల నుంచి నీరు కిందకు పారడం లేదు. దీంతో నారుమడులు దెబ్బతినడం ప్రతియేటా పరిపాటిగా మారింది. మాసూళ్ల కాలంలో అకాల వర్షాల్తో పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటోంది. రబీలో ప్రతియేటా నీటిఎద్దడి తలెత్తడం, వంతులవారీ విధానంలో నీటి పంపిణీ సాగుతోంది. కాలువలు పూడుకుపోయి సాగునీరు దిగువన ఉన్న పొలాలకు అందక రైతులు మోటారు ఇంజన్లు, ఇతర వాటిపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. డెల్టా ఆధునికీకరణపై పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఈ చావుకు బాధ్యులెవరు..?

లారీని ఢీకొన్న మోటారు సైకిల్
రోడ్డుపై పేరుకుపోయిన మట్టి వల్లే జారిన మోటారు సైకిల్
మహిళ దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం

ప్రమాద స్థలి

ప్రజాశక్తి - పెనుగొండ

అధికారుల పర్యవేక్షణా లోపం.. మట్టి బకాసురుల ధన దాహం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. ఇష్టానుసారం మట్టి తవ్వకాలు సాగించడమే కాకుండా ఆ మట్టి రవాణాలో కనీస జాగ్రత్తలు పాటిం చడం లేదనే దానికి ఈ ఘటనే నిదర్శనం. ట్రాక్టర్లు, లారీలపై మట్టిని తరలిస్తున్న సమయంలో ఆ మట్టి గడ్డలు రోడ్డుపై జారి పడకుండా కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలి. అవి పాటించకపోవడంతో మట్టి గడ్డలు రోడ్డుపై పేరుకుపోయి వర్షం కారణంగా రోడ్డంతా చిత్తడిచిత్తడిగా మారింది. ఈ పరిస్థితుల్లోనే రోడ్డుపై ఎవరి మార్గంలో వారు ప్రయాణిస్తున్న వాహనాల్లో ఒకటైన మోటారు సైకిల్ ఆకస్మాత్తుగా పక్కకు జారి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. అత్యంత విషాదకరమైన ఈ ఘటన పెనుగొండ మండలం వడలిలో వెంకటరమణ రైస్‌మిల్లు వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాని తెలిపిన వివరాల ప్రకారం వీరవాసరం మండలం కొణితివాడ గ్రామానికి చెందిన యరకరాజు దుర్గాభవాని (39), తన చిన్న కుమార్తె మాధవీలత, మనవడు హరీష్ (4)లను స్కూటీపై ఎక్కించుకుని సిద్ధాంతం రోడ్డు మీదుగా కోనసీమ జిల్లా పేరవరం బయల్దేరారు. పెనుగొండ దాటిన తర్వాత వడలి వెంకటరమణ రైస్‌మిల్లు సమీపానికి చేరుకునే సరికి మోటారు సైకిల్ పక్కకు జారి ఎదురుగా వస్తున్న హెచ్‌పి గ్యాస్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గాభవాని (39) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వాహనం నడుపుతున్న మధులత (21)కు తీవ్ర గాయాలవ్వడంతో రాజమండ్రిలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. హరీష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. దుర్గాభవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెనుగొండ ఎస్ఐ సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా..!

ఈ ప్రమాదానికి అసలు కారణం ఆ ప్రాంతంలో మట్టి రవాణా విచ్చలవిడిగా సాగించడమేనని జనం మండిపడుతున్నారు. విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు సాగించడం, ఆపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా తరలించడంతో రోడ్డు మీద మట్టి పేరుకుపోయింది. ఈ క్రమంలో బుధ, గురువారాలో వర్షం కురవడంతో రోడ్డు జారుతోంది. ఈ క్రమంలో ఆ రోడ్డుపై వెళ్తున్న మోటారు సైకిల్ మట్టి కారణంగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఇప్పటి వరకూ ఎన్నికల హడావుడిలో ఉన్నామనే పేరుతో అధికారులు మట్టి తవ్వకాలను, అక్రమ రవాణాను పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవడంతోపాటు రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇది కేవలం పెనుగొండ-సిద్ధాంతం రోడ్డుపైనే కాదని, జిల్లాలో పలు రోడ్లపై ఇదే పరిస్థితి ఉందని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పథకాల సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల సొమ్ము తక్షణమే లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ జిల్లా సెక్రటేరియేట్ సమావేశం సుందరయ్య భవనంలో చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లాలోని ప్రజా సమస్యలపై చర్చించారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు విడుదల చేయాల్సిన సబ్సిడీలు, అమ్మఒడి, వైఎస్ఆర్ ఇబిసి నేస్తం ఇంకా ఇతర పథకాల సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కాలేదన్నారు. తక్షణం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయాలని కోరారు. ధాన్యం మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని, కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని చెప్పారు. సంచుల కొరత ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరమూ ఉందని తెలిపారు. దళారుల దగ్గర సంచులు ఉండగా, ఆర్‌బికెల వద్ద లేవనడం సమంజసం కాదని అన్నారు. ఒకపక్క వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల రైతులు ఆందోళనకు గురౌతున్నారన్నారు. ఈ మధ్యే ఒకరిద్దరు రైతులు గుండెపోటుతో, చెట్టుకూలి చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. వెంటనే అధికారులు సంచుల కొరత సమస్యను అధిగమించి తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని, డబ్బు వెంటనే చెల్లించాలని కోరారు. తేమ పేరుతో ధరలో కోత పెడితే రైతుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వేసవిలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని, అరికట్టాలని అన్నారు. గరిష్టస్థాయిలో వేసవి ఎండలు ఉన్నాయని, ప్రభుత్వమే చలివేంద్రాలు నిర్వహించాలని అన్నారు. రైల్వేగేట్ల వద్ద, ప్రజల రద్దీ ఉన్న ప్రాంతాల్లో చలువ పందిళ్లు వేయాలని బలరాం అన్నారు. తాగునీరు కొరత, కలుషితం సమస్య వేధిస్తోందని, వీటి పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజలు కలుషిత నీరు తాగడం వల్లే రోగాలబారిన పడుతున్నారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యిందని, ఓటర్లను డబ్బు, మద్యంతో ప్రలోభాలకు గురిచేసినా నివారించడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని ఆరోపించారు. పోలింగ్ బూత్‌ల సంఖ్యను ఇంకా పెంచి ఉంటే ఓటింగ్ శాతం పెరిగుండేదన్నారు. పోలింగ్ కేంద్రాలు తక్కువగా ఏర్పాటు చేయడం వల్ల ఓటర్లు గంటలకొద్దీ సమయం క్యూలైన్లలో వేచి ఉండి ఓట్లు వేయ్యాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వృద్ధులు, వికలాంగులు, చంటిబిడ్డ తల్లులు నానావస్థలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లేసిన ప్రజలకు సిపిఎం తరపున అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెఎన్‌వి.గోపాలన్, కౌరు పెద్దిరాజు, కేతా గోపాలన్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

4న ఓట్ల లెక్కింపునకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జూన్ 4న ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 4 మంగళవారం జరిగే సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి భీమవరం విష్ణు కళాశాలలోను, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోను కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు (ఐటిబిపి), రెండులో ఆర్మడ్ రిజర్వ్ బలగాలు, మూడో అంచెలో స్థానిక సివిల్ పోలీసులను రక్షణగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లకు నిర్ణయించిన పరిధి వరకు మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తులు, ఇతరుల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోరని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఇవిఎంలను తరలించే మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి మార్గాలు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆచంట నియోజకవర్గానికి సంబంధించి విష్ణు కాలేజీ ఆవరణలోని బి.సీత పాలిటెక్నిక్ కళాశాల రెండో అంతస్తులో, పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించి బి.సీత పాలిటెక్నిక్ కాలేజ్ సెకండ్ ఫ్లోర్ డ్రాయింగ్ హాల్ నెం.1లో, నరసాపురానికి సంబంధించి శ్రీ విష్ణు ఫుడ్‌ప్లాజా-1 డైనింగ్ హాలులో, తణుకు నియోజకవర్గానికి సంబంధించి శ్రీ విష్ణు స్కూల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో, అలాగే భీమవరం నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యు-బ్లాక్ రెండో అంతస్తులో, ఉండి నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యు-బ్లాక్ మూడో అంతస్తులో కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశామని, ఇదే స్ఫూర్తితో కౌంటింగ్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పలుచోట్ల వర్షం

ఆచంట: చిరుజల్లులకు నిర్మానుష్యంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలంలో గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత వారం రోజులుగా ఎండ వేడిమితో, ఉక్కపోతతో ఉక్కరిబిక్కిరి అయిన వృద్ధులు కాస్త ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడటంతో చిన్నారులు, యువకులు కేరింతల కొడుతున్నారు. కాగా మధ్యాహ్నం నుంచి మరలా ఉక్కబోత మొదలైంది. దీంతో వాతావరణం చల్లబడటం, మధ్యాహ్నం నుంచి ఎండవేడిమితో ఉక్కపోత యధావిధిగా కొనసాగింది.

పాలకొల్లు : గత నెల రోజులుగా తీవ్ర ఎండ ప్రభావంతో సతమతమవుతున్న ప్రజలకు గురువారం కురిసిన తేలికపాటి వర్షం ఉపసమనాన్నిచ్చింది. తీవ్ర ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు శాంతించారు. వాతావరణం మార్పుతో ఒక్కసారి చల్లబడింది. చిరుజల్లులు కూడా పడ్డాయి. మధ్యాహ్నం ఎండ, వాన మారుతూ ఉక్కిరిబిక్కిరి చేసింది.

ప్రజల్లో ఆనందం.. రైతుల్లో గుబులు

అయితే రైతులు మాత్రం వాతావరణం మార్పుకు ఆందోళన చెందుతున్నారు.

వర్షం వల్ల ఆగిన వరి కోతలు, మాసూళ్లు

పెనుమంట్ర : ఈనెల 15, 16 తేదీల్లో పడిన వర్షాలకు మండలంలోని అక్కడక్కడా జరుగుతున్న వరి పంట కోతలు, మాసూళ్లు ఉన్న పలంగా ఆగిపోయాయి. మధ్యాహ్నం వరకూ వాతావరణం మబ్బులు, చిరు జల్లులతో ఉండడంతో ఈ ప్రాంతంలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ నుంచి రైతుల అవసరం మేరకు ధాన్యం పట్టుబడికి గోనె సంచులు సరఫరా జరగనందున వాతావరణం మార్పుకు, వర్షానికి దొరికి పోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకివీడు: గత రెండు రోజులుగా వరుసగా వానలు కురవటం, గురువారం కూడా ఆకాశం భారీగా మేఘావృతం కావడంతో రైతులు హడావిడిగా కుప్ప నోర్పెళ్లు, మాసూళ్లు ప్రారంభించారు. ఒకపక్క వరి చేలలో ఎక్కడ పనలు అక్కడే ఉన్నాయి. ఈ దశలో తనలో తడిసి నానితే మొక్కు వచ్చే ప్రమాదం ఉంది. తడిసిన పనులు వెంటనే కొట్టి దాన్ని ఎండబెట్టుకుని అమ్ముకునేందుకు రైతు చూస్తాడు. ఈ పరిస్థితుల్లో హడావిడిగా వరికుప్పలు నూరుస్తున్నాడు. మరోపక్క ఇప్పటికే వచ్చిన ధాన్యం రాశులు ఎక్కడికక్కడ గట్ల మీద ఉన్నాయి. ఆరబెట్టి ధాన్యం విక్రయించేందుకు ఎదురుచూస్తున్న రైతు ఈ దశలో వాన రైతును ఇబ్బందులు పాలు చేసింది. ఇప్పటికైనా వానలు తగ్గితే రైతు దాన్ని ఆరబెట్టుకొనేందుకు అవకాశం కలుగుతుంది. ఇక ఆ తడిసిన ధాన్యం కొనే బాధ్యత ప్రభుత్వంపై పడుతోంది. అయితే ప్రస్తుత దశలో ప్రభుత్వం మాట్లాడే పరిస్థితి కనిపించడం లేదు. వాతావరణ పరిస్థితులపై అధికారులు స్పందించాలని రైతులు వేచి చూస్తున్నారు.

ఆకివీడు:హడావిడిగా కుప్ప నూర్పిళ్లు

పెనుమంట్ర : బరకాలు కప్పి ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు

డెంగీపై అవగాహన ముఖ్యం

డిఎంహెచ్ఒ ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - వీరవాసరం

డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్యాధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. డెంగీపై అవగాహనా సదస్సును పిహెచ్‌సి వైద్యాధికారి నవనీత్ అధ్యక్షతన బుధవారం కొణితివాడ పిహెచ్‌సి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డెంగీ జ్వరాలపై అవగాహన లేకపోవడంతో ప్రయివేటు వైద్యశాలల్లో ప్రజలు మోసపోతున్నారన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు తడి లేకుండా చేసుకోవడం వల్ల డెంగీకి కారణమైన దోమలను నిర్మూలించుకోవచ్చునని ప్రాథమిక అవగాహన ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడం వల్లే డెంగీతోపాటు ఇతర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శిరీష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

శరవేగంగా జరుగుతున్న రహదారి పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. మండల కేంద్రంలోని పాతకాలవ సెంటర్ ప్రాంతం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం మీదుగా పెద పల్లవపాలెం వరకూ చేపట్టిన రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ రహదారితో పాటు కాళీపట్నం మల్లాడి దిబ్బలలో జాతీయ రహదారి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న రహదారులకు రూ.10 కోట్ల నిధులు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ మంజూరు చేసింది. ఆ నిధులతో చేపట్టిన పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ రహదారులను బిటి రోడ్లు అభివృద్ధి చేసి ఆర్ అండ్ బి శాఖకు అప్పగించనున్నారని ఆ శాఖ డిఇ కిరణ్ కుమార్ తెలిపారు.

పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రారంభమైన ఎపిఇఎపి సెట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎపిఒ ఎపి సెట్ ప్రవేశ పరీక్ష గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం పరీక్ష ప్రారంభ సమయంలో కురిసిన చిరుజల్లులకు విద్యార్థులు పరీక్ష కేంద్రాన్ని చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం పరీక్షకు 175 మందికి 154 మంది హాజరయ్యారు. 21 మంది పరీక్షకు హాజరు కాలేదు. మధ్యాహ్నం పరీక్షకు 175 మందికి 159 హాజరయ్యారు. 16 మంది పరీక్షకు హాజరు కాలేదని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరిటెండెంట్ డాక్టర్ ఎన్.గోపాల్ కృష్ణమూర్తి తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 21 నుంచి 24 వరకు విజయవాడలో జరుగనున్న యూత్ బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టును ఎంపిక చేశారు. గురువారం సాయంత్రం మార్టేరు ఎస్‌విజి ఉన్నత పాఠశాల బాస్కెట్ బాల్ క్రీడా ప్రాంగణంలో ఈ ఎంపికలను జిల్లా బాస్కెట్ బాల్ ఎంపిక కమిటీ ప్రతినిధులు మద్దాల వాసు, కర్రి కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాస్, వి.మురళీ కృష్ణ, ఎస్.హరి, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సత్తి సుబ్బన్న రెడ్డిలు నిర్వహించారు. ఈ ఎంపిక అనంతరం బాలుర విభాగం క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. వారు వరుసగా ఎస్.కృష్ణ, ఎ.ఈశ్వరతేజ, ఎన్.సోమశేఖర్, ఎం.సాంబసూర్య, వి.భాను ప్రకాష్, జి.వరప్రసాద్, జె.అనీష్, ఎఎంకె రామిశెట్టి, ఎం.ప్రవీణ్, వి.ధరనేందర్, ఆర్.ఆదిత్య, టి.జయరామి రెడ్డి, స్టాండ్ బై షేక్ సిరాజ్ బాషా, ఈ.చార్లెస్ వెస్లీ, సిహెచ్.టెండూల్, బి.రాకేష్‌లు ఎంపిక అయ్యారు. ఆ పోటీలలో పాల్గొనే జిల్లా బాలికల జట్టు (ఏలూరు) వివరాలు వరుసగా ఎ.రుత్విక, పి.జయశ్రీ, జి.పూజిత, పి.నందిని, ఎన్.రేణుక, ఎస్.సాయి భవాని, డి.అమృత, బి.దేవిశ్రీ, జి.సరిత, కె.పూజిత, జి.యేసమ్మ, ఎ.రియా, కాగా స్టాండ్ బైగా పి.లహరి, ఎంవిడి.భావశ్రీ, టి.పూజిత ఎంపిక అయినట్టు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా బాలురు, బాలికల ఇరు జట్లకు ఎంపిక ప్రతినిధుల బృందం ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపికైన ఏలూరు జిల్లా బాలికల జట్టు

విద్యార్థులు కనీస జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - ఉండి

వేసవి తాపం ఎక్కువగా ఉండటం వల్ల గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ఉండి శాఖ గ్రంథాలయం అధికారి జెవి.కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం జెవి కృష్ణమూర్తి మాట్లాడుతూ వేసవి తాపం రోజురోజుకీ పెరుగుతుండడంతో గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు కనీస జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరూ టోపీ ధరించడం, తలకి రుమాలు కట్టుకోవడం వంటివి చేయాలని, విద్యార్థినులు చున్నీలతో ముఖాన్ని కప్పుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా మంచినీటిని అధిక శాతంలో తీసుకోవాలన్నారు. ఈవిధంగా చేయడం వల్ల కొంత ఉపశమనం కలుగుతుందని, వేసవి తాపం నుంచి తమను తాము రక్షించుకోగలరని తెలిపారు. గ్రంథాలయాలను సందర్శించిన విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారన్నారు.

వర్షానికి ఆగిన పొగ.. ఊపిరి పీల్చుకున్న ప్రజలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 15, 16 తేదీల్లో కురిసిన వర్షానికి మార్టేరు శివారు స్మశానం, డంపింగ్ యార్డ్ ప్రదేశంలో రోజూ వెదజల్లే పొగలు ఆగడంతో వాహనదారులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మార్టేరు నుంచి పండిత విల్లూరు, తూర్పు పాలెం, ఆచంట, కోడేరు, ఆచంట వేమవరం వయా పాలకొల్లు ఇవతల అన్ని గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో డంపింగ్ చెత్తను తగల బెట్టడం వల్ల వెలువడ్డ తీవ్రమైన పొగతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బంది పడిన సంగతి విధితమే.



వేసవి శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం

ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ సంచాలకులు, పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారుల ఉత్తర్వులు ప్రకారం ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు పిల్లలకు సంబంధించిన వివిధ సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి తెలిపారు. గురువారం పాల్గొన్న విద్యార్థులచేత కథలు పుస్తకం చదివించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చినమిల్లి శ్రీనివాసరావు, హెచ్ఆర్‌డి డైరెక్టర్ పాల్గొని మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతుల ముఖ్య ఉద్దేశం పిల్లలు ఎక్కువగా పుస్తకాలు చదవాలి, చదవడంతో పాటు మననం చేసుకోవాలి, పవర్ ఆఫ్ నాలెడ్జ్ సంపాదించుకుని ఒక లక్ష్యం కలిగి ఉండటానికి గ్రంథాలయంలో ఇది ఒక అవగాహన సదస్సు వంటిదని తెలిపారు. చదవడం ద్వారా సంపూర్ణ పరిజ్ఞానం వస్తుంది, తద్వారా మంచి పౌరుడిగా అభివృద్ధి చెందిన వ్యక్తిగా విజయం సాధిస్తారన్నారు. వేమన పద్యాలపై శ్రీనివాస్ మాస్టారు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో పండా త్రినాథ్, బాబుశ్రీ, సుధీర్ మోహన్, సూర్యం బాబు, జీవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజె ఎస్ఎల్.కుమారి కోరారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని శేరేపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై నరసాపురం ఎస్ఇబి అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. శేరేపాలెం పంచాయతీ 6వ వార్డు సభ్యుడు కత్తుల శ్రీనివాస్ ఆన్ లైన్‌లో స్పందనలో ఈవిషయంపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో అనుమతి లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల రహదారులు ఛిద్రంగా మారుతున్నాయని, అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల సంచారంతో గ్రామంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో నరసాపురం ఎస్ఇబి సిఐ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బందితో గ్రామంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై తనిఖీలు నిర్వహించారు. అధికారుల తనిఖీ విషయం ముందుగా తెలియడంతో ట్రాక్టర్లు, లారీల ఎగుమతులను ఇసుక మాఫియా ఆపివేసిందని అధికారులు వెళ్లిన వెంటనే తిరిగి ఇసుక తవ్వకాలు, ఎగుమతులు యధావిధిగా జరిగాయని ఫిర్యాదు దారుడు కత్తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపివేసి తవ్వకందారులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

వివరాలు నమోదు చేస్తున్న ఎస్ఇబి అధికారులు

అన్నసమారాధనలో భక్తులు

దత్త సాయి మందిరంలో అన్న సమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్త సాయి మందిరంలో గురువారం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా యాత్రికులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. ఈ అన్న సమారాధనకు పేట సూర్యప్రకాష్ రూ.2,500 నగదు, తోట శ్రీనివాసరావు, గుబ్బల శ్రీనివాసరావు, పెద్దమల్లు సూర్యతేజ(సూర్య బిస్కెట్స్), దత్తసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాట్లు చేశారు.

జగన్మోహన్‌రెడ్డిని సాగనంపడమే

జనసేన సమీక్షలో బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి, జనసేన కూటమి తరుపున తిరిగిన నాయకులతో పాటు కార్యకర్తలు, సామాన్య ప్రజలు కూడా జగన్మోహన్ రెడ్డిని తరిమికొట్టేందుకు కసిగా పని చేశారని, జగన్ మరోసారి అధికారం చేపడితే రాష్ట్రానికి కలిగే ప్రమాదాన్ని అంతా గుర్తించారని జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పట్టణం, తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలంలోని గ్రామాలకు చెందిన టిడిపి, జనసేన కూటమి నాయకులు గురువారం జనసేన కార్యాలయంలో బొలిశెట్టి శ్రీనివాస్‌ని కలిసి సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టేది కూటమి ప్రభుత్వమేనని, చంద్రబాబు నాయుడు విజన్, పవన్ కళ్యాణ్ నిబద్దత అన్నీ కలిపి రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకు వెళ్లడం ఖాయమన్నారు.

వైసిపి కార్యకర్తకు బొలిశెట్టి ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం జనసేన ఇన్‌ఛార్జి మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు. జువ్వలపాలెంకు చెందిన వైసిపి కార్యకర్త జయప్రకాష్ సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో జరిగిన తోపులాటలో గాయపడ్డారు. ఈ ప్రమాదంలో జయప్రకాష్ కుడికాలు విరిగిపోవడంతో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బొలిశెట్టి శ్రీనివాస్ జువ్వలపాలెం జన సైనికులతో సంప్రదించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఎన్నికల వరకు మాత్రమే పార్టీలు, రాజకీయాలు అన్నారు. ఎన్నికల తర్వాత అందరూ ఒకటే అని తెలిపారు. కష్టాల్లో ఉన్న వారికి ఎప్పుడూ తోడుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 21 నుంచి 29 వరకు పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ జవ్వాజి పానకాలు, ఇఒ పిటి గోవిందరావు తెలిపారు. 22న చంద్రవాహన సేవ, 23న శేషవాహన సేవ, 24న హనుమంత వాహనసేవ, 25న గరుడవాహన సేవ, 26న ఎదురు సన్నాహ ఉత్సవం, 27న రథోత్సవం, 28న వసంతోత్సవం, 29న సుదర్శన మహాయజ్ఞం, పుష్పయాగం, ధృవ మూర్తుల తిరుమంజనం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చెత్తతో పూడుకుపోతున్న చినకాపవరం డ్రెయిన్

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లాలో ఉన్న మీడియం డ్రెయిన్‌లలో అతి పెద్ద డ్రెయిన్ చినకాపవరం డ్రెయిన్. అసలే ఆక్రమణలతో చిక్కిపోతున్న ఈ డ్రెయిన్ ఆకివీడు నగరపంచాయతీ చెత్తతో మరింత పూడికపోతోంది. మహారాష్ట్రలో కురిసే ప్రతీ భారీ వర్షానికి ఇక్కడ ఈ డ్రెయిన్ పొంగుతుంది. చినకాపవరం వద్ద వెంకయ్య కాలువ నుంచి విడివడి ఏర్పడిన ఈ డ్రెయిన్ సుమారు 6 మండలాలకు చెందిన వరి సాగు మురుగునీరు, వాన నీరు అధిక మురుగును ఉప్పుటేరు గుండా సముద్రంలోకి చేరుస్తుంది. తాడేపల్లిగూడెం, పిప్పర, అత్తిలి, గణపవరం, ఆకివీడు మండలాల్లోని వరి సాగు కాలువలకు దిగువ ఉన్న మురుగు చినకాపవరం వద్ద వెంకయ్య కాలువ నుంచి వచ్చి ఈ మురుగు కాలువలో కలుస్తుంది. ఈ కాలువ చినకాపవరం నుంచి ఆకివీడు వచ్చే సుమారు పది కిలోమీటర్ల దూరంలో అనేకమంది ఆక్రమించారు. ఏళ్ల తరబడి ఆక్రమణలను తొలగించేందుకు అధికారులకు రాజకీయాలు, భారీగా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో ఈ కాలువ ఆకివీడు మండలానికి దుఃఖదాయినిగా మారింది. పది కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ కాలువకు ఎడాపెడా 8 గ్రామాలున్నాయి. కాలువ నిండితే చాలు మొత్తం గ్రామాలలో ఉన్న పంట సాగు ఆయకట్టుతో సహా

డ్రెయిన్‌లో చెత్తవేయడంతో పూడుకుపోతున్న కాలువ

గ్రామాలు మునిగిపోతాయి. ఆకివీడు, మాదివాడ పల్లపు ప్రాంతాలు మొత్తం నీట మునిగిపోతాయి. ప్రతిఏటా వానాకాలం ఈ కాలువ గట్టున ఉన్న వందలాది కుటుంబాలను శిబిరాలకు మళ్లించడం ఆనవాయితీగా మారిపోయింది. ఇంతటి దీనస్థితిలో ఉన్న పరిస్థితిని చక్కదిద్దాల్సిన అధికారులు, రాజకీయ నాయకులు సైతం కాలువ పూడికకు తోడ్పాటు హాస్యాస్పదంగా ఉంది.

నగర పంచాయతీ డంపింగ్ యాడ్‌ను సిద్దాపురం రోడ్‌లో ఉన్న ఈ కాలవ గట్టున ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయడంతో క్రమంగా కాలువ పూడికపోతుంది. మరో పక్క సిద్దాపురం వైపు వెళ్లే గ్రామాల వారికి ఈ మార్గంలో ఈ చెత్తతో నరకం కనిపిస్తోంది. 15 అడుగుల రోడ్డు పూడికపోతోంది. ఎవరో ఒకరు ఆ చెత్తను అంటించడం, భారీస్థాయిలో ఆ పరిసరాలు, నివాసాలలో పొగలు కమ్మి ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇవన్నీ ఒక ఎత్తైతే కాలువ పూడ్చివేయడం ఒక ఎత్తు. అధికారులు ఈ పని ఎందుకు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. నగర పంచాయతీ సొమ్ము లక్షలకు లక్షలు దారి తప్పుతున్నా పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు డంపింగ్ యార్డ్ కోసం స్థలం కొనడానికి ఆలోచించడం గమనార్హం. ఇప్పుడు చెత్త పోసే చోట వెనుక భాగంలో ఉన్న సుమారు రెండెకరాల నర భూమి ప్రభుత్వానికి చెందింది. ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోలేని దుస్థితిలో ఉన్న అధికారులు, రాజకీయనాయకులు ప్రజల ఆరోగ్యాన్ని, ప్రకృతి వరప్రసాదంగా ఏర్పడిన ఈ మురికి కాలువను పూడ్చి వేయడం గమనార్హం.

కాయ్.. రాజా కాయ్..

ఎన్నికల్లో గెలుపుపై జోరుగా పందేలు

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికలు పూర్తి కావడంతో ఆచంట నియోజకవర్గంలో బెట్టింగ్ రాయుళ్లు కాయ్ రాజా కాయ్ అంటూ పందేలకు కాలు దువ్వుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, టిడిపి కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ ఇరు పార్టీల మధ్య పోరు రసవత్తరంగా సాగింది. నియోజకవర్గంలో పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లో ఓటింగ్ సరళి అధికంగా ఉండడంతో ప్రజల్లో ఫలితాలపై ఆత్రుత ఏర్పడింది. ఈ తరహాలో రంగనాథరాజు ఇటీవల తూర్పుపాలెం కార్యాలయం వద్ద కార్యకర్తలకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి తమ విజయంపై ధీమా వ్యక్తం చేశారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ కూడా తన గెలుపు వన్ సైడ్ అంటూ లెక్కలు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీ ఎత్తున పందేలకు సిద్ధమయ్యారు. ఈ పందేలు వేల రూపాయల నుంచి లక్షల్లోకి చేరింది. పందెం రాయుళ్ల రూ.లక్షల్లో పందెం కాయడంతో ప్రజల్లో ఆసక్తి పెరుగుతుంది. ఈసారి పరిస్థితులు ఏ విధంగా ఉంటాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొంతమంది కార్యకర్తలు డబ్బులు లేకపోయినా అప్పులు చేసి మరీ పందేలకు సిద్ధపడ్డారు.

రాజకీయ పార్టీల అంచనాల కన్నా పందేల రాయుళ్ల అంచనాలు మిన్నంటుతున్నాయి. కాకి లెక్కలు వేస్తూ అక్కడ ఓటింగ్ బాగుంది, ఇక్కడ గాలి వీచింది అంటూ కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. ఈ తరహాలో కుల సంఘాల కట్టుబాట్లు, చేర్పులు మార్పులు, వీటిన్నంటినీ పందెం రాయుళ్ల లెక్కలు వేస్తున్నారు. అయితే ఓటర్ల తీర్పు ఏవిధంగా ఉంటుందనే దానిపైనే సర్వత్రా చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరు గెలుస్తారో తెలియాలంటే మరో పదహారు రోజుల వరకూ ఆగవలసిందేనని పలువురు సమాధానం ఇస్తున్నారు.

నరసాపురంలో గెలిస్తే మంత్రేనా?

ఎంఎల్ఎగా ఎవరు గెలిచినా పదవి ఖాయమని ఊహాగానాలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో గెలిచే ఎంఎల్ఎ అభ్యర్థికి మంత్రి పదవి ఖాయమని పెద్ద ఎత్తున వార్తలు వినిపిస్తున్నాయి. అది ఏ పార్టీ నుంచి అయినా ఖచ్చితంగా జరిగే అవకాశాలు ఉన్నాయి. టిడిపి ప్రభుత్వంలో ఉమ్మడి రాష్ట్రంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మినహా ఇప్పటి వరకూ మంత్రిగా పనిచేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముదునూరి ప్రసాద్ రాజు మంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. 2019లో ప్రసాద్ రాజు నరసాపురం నుంచి గెలుపొందారు. తొలి విడతలో క్షత్రియ సామాజిక వర్గం నుంచి పశ్చిమగోదావరి జిల్లా ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజుకు మంత్రిగా అవకాశం ఇచ్చారు. రెండో విడతలో ఆయనకు మంత్రి అవకాశం రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రసాద్ రాజుకు అవకాశం ఇచ్చారు. 2024లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రసాదరాజుకు మంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రసాద్ రాజు 2009లో ఎంఎల్ఎగా గెలిచారు. 2012లో వైఎస్ఆర్ కుటుంబం కోసం రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయగా ఓటమిపాలయ్యారు. 2019లో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌పై ఎంఎల్ఎగా గెలుపొందారు. ప్రసాద్ రాజు వైఎస్ఆర్ కుటుంబ సభ్యులకు విధేయుడు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి బొమ్మిడి నాయకర్ గెలిస్తే మంత్రి సీటు ఖచ్చితమని ఆయన అనుచరులు అంటున్నారు. 2019 ఎన్నికల్లో తక్కువ ఓట్లతో నాయకర్ ఓడిపోయారు. 2019 నుంచి రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం ఛైర్మన్‌గా నాయకర్ పనిచేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నాయకర్ పార్టీలో ఉన్నారు. 2024 ఎన్నికల్లో గెలిస్తే మంత్రి అవకాశాలు ఉంటాయని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

అవగాహనతోనే డెంగీ నివారణ

పలుచోట్ల అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - కాళ్ల

సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దామని వైద్యాధికారి ఎస్.సునీల్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి ఎస్.సునీల్ ఆధ్వర్యంలో కాళ్ల గ్రామంలో డెంగీ అవగాహనా ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా దోమలు నీరు నిల్వ ఉన్నచోట గుడ్లుపెట్టి అభివృద్ధి చెందుతాయని, అవి పెరగకుండా ఫ్రైడే డ్రైడే అందరు పాటించాలని తెలిపారు. అనగా నీరు నిల్వ చేయు పాత్రలు ప్రతి వారం ఖాళీ చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ కుట్టకుండా దోమతెరలు వాడుట, ఇంట్లో పొగ పెట్టి దోమలను తరిమివేయుట చేయాలని చెప్పారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు చేసుకుని చికిత్సలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, సిహెచ్ఒ డి.విజయవతి, ఎంపి హెచ్ ఇఒ పాల్ సన్, పిహెచ్ ఎన్.ఛండి రాణి, హెచ్‌వి.పరంజ్యోతి, సుబ్బలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్‌లో డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

తాడేపల్లిగూడెం: డెంగీ వ్యాధిని అవగాహనతోనే అదుపు చేయవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవంను పురస్కరించుకొని పట్టణ పరిధిలోని వీకర్స్ కాలనీ, ఎన్‌టిఆర్ జంక్షన్, కదకట్ల, యాగర్లపల్లి ఆరోగ్య కేంద్రాల

గణపవరంలో..

వద్ద డెంగీ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అనీషా, డాక్టర్ తనూజలు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారిద్దాం అని పిలుపునిచ్చారు. వ్యాధి నిర్ధారణా పరీక్షలు, చికిత్స అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంటాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స ఉంటుందన్నారు. సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారించుటకు ముందుస్తు కీటక నియంత్రణ చర్యలు, లార్వా జనిత ప్రదేశాలను నిలువరించుటలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ వ్యాధుల వ్యాప్తి చెందకుండా నియంత్రణా చర్యలు, ఫాగ్గింగ్ ఆపరేషన్, స్ప్రేయింగ్ ఆపరేషన్, లార్వా జనిత ప్రదేశాలను గుర్తించి కీటక నియత్రణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అవగాహనా కార్యక్రమాలు చేయడం ద్వారా వ్యాధి అరికట్టుటకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు ఇ.కాంతారావు, ఎన్.ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

గణపవరం: డెంగీ జాతీయ దినోత్సవం సందర్భంగా గురువారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్ నాయుడు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు నివారించవచ్చని తెలిపారు. దోమల వల్ల డెంగీ వ్యాధి రావడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా చేసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో పనికిరాని పాత డబ్బాలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో మురికి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని

తాడేపల్లిగూడెంలో

చెప్పారు. డెంగీ వ్యాధిపై తమ సిబ్బంది స్థానికులకు గ్రూపు సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఎంఎల్ హెచ్ పీలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: దోమల ద్వారా డెంగీ వ్యాధి ప్రబలుతుందని, ఈ వ్యాధి సోకిన వారికి విపరీతమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, వికారం, రక్త కణాలు తగ్గుట, ఒంటి మీద దద్దుర్లు ఏర్పడుట, కనుగుడ్లు ఎర్రబడుట తదితర లక్షణాలు ఉంటాయని డాక్టర్ ప్రతాప్ కుమార్ తెలిపారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జాతీయ డెంగీ వ్యాధి నివారణా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ వ్యాధి తీవ్ర దశలో రక్తనాళాలు చిట్లి పోవుట వల్ల కళ్ల నుంచి రక్తం కారుట, పంటి చిగురు నుంచి రక్తం కారుట, విరోచనం ద్వారా రక్తం కారుట తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి తీవ్ర దశకి చేరకముందే

కాళ్లలో..

దోమలు పెరగకుండా, కుట్టకుండా జాగ్రత్త వహించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి కె.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎవరికైనా డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలని, చికిత్స వెంటనే తీసుకున్న ఎడల ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమలు పెరగకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్, సబ్ యూనిట్ అధికారి కె.రాజ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్వైజర్ ఎస్‌కె.అమలేశ్వర రావు, జి.ఉదయ చంద్ర పాల్గొన్నారు.

ఉండి: డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయి చంద్ర, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఐసి కీర్తన అన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.సాయి చంద్ర, డాక్టర్ కీర్తన ఆధ్వర్యంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ బి.సాయిచంద్ర, డాక్టర్ కీర్తన మాట్లాడుతూ డెంగీ వ్యాధి ఏడీస్ దోమ నుంచి వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మురికి నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. అధిక జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు వంటివి డెంగీ వ్యాధి లక్షణాలని, అవి విపరీతంగా ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వారు సూచించారు. డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమ పెరుగుదలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారామ్‌ను కలిసిన జబర్దస్త్ నటుడు

భీమవరం రూరల్: భీమవరం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జబర్దస్త్ నటుడు పంచ్ ప్రసాద్ దంపతులు కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారామ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకెం సీతారామ్‌కు ప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అంకెం సీతారామ్ మాట్లాడుతూ ప్రసాద్ తన బాల్య స్నేహితుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనం రవికుమార్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **INGALLA JYOTHIRMAI,** W/o. **Ingalla Lakshmoji** and Residing at D.No. 9-44/A, Gandhi Nagar, Kovvali, Denduluru Mandal, Eluru, Andhra Pradesh, Ph: 9985811439 Changing My Name from **INGALLA JYOTHIRMAI** (Old Name) to **INAGALLA JYOTHIRMAI** (New Name), W/o. **Inagalla Lakshmoji.** Hence forth I am being called as **INAGALLA JYOTHIRMAI** (New Name). For all purpose.

In the Court of Spl. Judicial Ist Class Magistrate for Exice Court, Eluru, W.G.Dist.,
O.S. 68/2021

Between:
Moru Yuva Raju ...*Plaintiff*
&
1. Bale Prabhakara Rao
Bale Avva Mani ...*Defendants*

పై నంబరు గ్రంథంలో ***D-1:*** Bale Prabhakara Rao, S/o. Sowbhagya Rao, R/o. D.No. 73-9, Gudivaka Lanka Village, Eluru Mandal.
D-2: Bale Avva Mani, W/o. Prabhakara Rao, D.No. 73-9, Gudivaka Lanka, Eluru Mandal.

అను వారికి నోటీసులు అమలు కొరకు ది. 21-6-2024 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
యర్రా సురేష్, అడ్వకేట్
ఏలూరు, సెల్: 9490433134

దావా సమను
మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పాలకొల్లు
O.S. No. 240/2023

బిట్వీన్:
మేడపాటి వెంకట సత్యనారాయణరెడ్డి -వాది
Vs
కలిసిపూడి సుధాకర్ & 4 ఇతరులు -ప్రతివాదులు

To:
3వ ప్రతివాది: మంతెన వెంకట వరప్రసాద్, S/o. చంద్రరావు, డోర్ నెం. 6-80, రాయకుదురు, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 3వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు దావాను ది. 2-7-2024 కు వాయిదా వేసినారు. కాబట్టి 3వ ప్రతివాది పై నెంబరు దావాలో **ది. 2-7-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 3వ ప్రతివాది పరోక్షమందు పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు తెల్పడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం.వెంకట రామారెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
తేది: 17-05-2024 సెల్:9440110677

నోటీసు
మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, పాలకొల్లు
I.A. No. 618/2023
O.S. No. 240/2023

బిట్వీన్:
మేడపాటి వెంకట సత్యనారాయణరెడ్డి -పిటీషనర్/వాది
Vs
కలిసిపూడి సుధాకర్ & 4 ఇతరులు -రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

To:
3వ రెస్పాండెంట్: మంతెన వెంకట వరప్రసాద్, S/o. చంద్రరావు, డోర్ నెం. 6-80, రాయకుదురు, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషనులో 3వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషను ది. 2-7-2024 కు వాయిదా వేసినారు. కాబట్టి 3వ రెస్పాండెంట్ పై నెంబరు పిటీషనులో **ది. 2-7-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 3వ రెస్పాండెంట్ పరోక్షమందు పై నెంబరు పిటీషను శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు తెల్పడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం.వెంకట రామారెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
తేది: 17-05-2024 సెల్:9440110677

KVB Karur Vysya Bank
Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
డోర్ నెం. 22-15-21, M.R.O. ఆఫీస్ ఎదురుగా, భీమవరం-1 ఫోన్ : 233652

బంగారు ఆభరణములు బహిరంగ వేలము ప్రకటన
ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకువారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు. కావున తెలియజేయడమైనది.
వేలం జరుగు తేది : 30-05-2024, సాయంత్రం 4:00 గం.కు

వ నెం.	అకౌంట్ నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం బరువు గ్రా॥లలో
1.	1431952000033851 1431953000037855 1431953000037870 1431953000037886	**కొట్టు సత్యనారాయణ** డోర్ నెం. 19-24/1 రెడ్డి కాలనీ, బ్యాంక్ కాలనీ దగ్గర, శ్రీకృష్ణ దేవరాయ కళ్యాణ మండపం - 534 202, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్	88.20 135.80 112.80 178.90

ముఖ్య నియమ నిబంధనలు : 1. పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసులకు (అవి అందినను లేక ఏ కారణం చైతనైనను తిరిగివచ్చినను) దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినదిగా. 2. ఒక వేళ ఋణ గ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3. వేలం నందు పాల్గొనదలచినవారు రూ. 10,000/- ధరావత్తు ది. 30-05-2024 మధ్యాహ్నం గం.2:00 గంటల లోగా బ్యాంకు నందు జమచేసి రిజిష్టర్ చేసికొనవలయును. ధరావత్తు చెల్లించిన వక్తిని మాత్రమే ఆక్షను హాలులోకి అనుమతించబడును. 4. విజయవంతమైన ఆపాటదారుడు వేలం తేది సాయంత్రం 4:00 గం.లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. 5. నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకొనవలెను. అందుకు బ్యాంకు బాధ్యత వహించజాలదు. 6. ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండగానే వేలమును పాక్షికంగా గాని, పూర్తిగా గాని రద్దుచేయు అధికారం బ్యాంకుకు కలదు. 7. పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా రుజువులను ప్రాథమికంగా దాఖలు చేయుట తప్పనిసరి. 8. ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు బ్రాంచి నందు సంప్రదించగలరు.
భీమవరం తేది: 16-05-2024 సం/- బ్రాంచ్ మేనేజర్